

కోహెడ మండలం వరుకోలు
గ్రామ కొనుగోలు కేంద్రంలో మొలకలైన ధాన్యం

మండలాలకు పాఠ్యపుస్తకాలు

- బడుల ప్రారంభం రోజు నుంచే పంపిణీకి సన్నద్ధం



పుస్తకాలను మండల కేంద్రాలకు పంపిస్తున్న సిబ్బంది


సిద్దిపేట క్రైం, మే 18 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 12న పంపిణీ చేసేందుకు జిల్లా కేంద్రానికి చేరుకున్న పుస్తకాలను ఆయా మండల కేంద్రాలకు తరలిస్తున్నారు.

రెండు విడతలుగా పంపిణీ

ప్రతీ సంవత్సరం పార్ట్-1 విభాగం కింద తెలుగు, హిందీ, ఇంగ్లిష్ వంద శాతం సిలబస్‌తో కూడిన పుస్తకాలను, గణితం, సైన్స్, సోషల్ 50 శాతం సిలబస్‌తో కూడిన ద్వి భాషా పుస్తకాలను(ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలలో ప్రింట్ అయినవి) జూన్ నెలలోనే పంపిణీ చేయనున్నారు. పార్ట్-2 విభాగం కింద మిగిలిన సిలబస్‌తో కూడిన మ్యాథ్స్, సైన్స్, సోషల్ ద్వి భాష పుస్తకాలను అక్టోబరులో అందజేస్తారు. పార్ట్-1 విభాగం కింద జిల్లాకు 5,34,000 పుస్తకాలు రావాల్సి ఉండగా 2,72,800 పుస్తకాలు చేరుకున్నాయి. నెలాఖరు వరకు మిగిలిన 50 శాతం పుస్తకాలు రానున్నాయి. వచ్చిన వాటిని ఇప్పటికే జిల్లా గోదాం నుంచి మండల కేంద్రాలకు పంపిస్తున్నారు.

మొదటి విడతలోనే 100 శాతం నోట్‌బుక్‌లు

పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లను కూడా మొదటి విడతలోనే 100 శాతం పంపిణీ చేయనున్నది. ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు, 1 వైట్ లాంగ్ నోట్ బుక్, 5 లైనింగ్ నోట్‌బుక్‌లు కలిపి మొత్తం 6 నోట్‌బుక్‌లను ఇవ్వనున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఏడు వైట్‌లాంగ్ నోట్‌బుక్‌లు, 9, 10వ తరగతి విద్యార్థులకు 14 వైట్‌లాంగ్ నోట్‌బుక్‌లను పంపిణీ చేస్తారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు 12 వైట్‌లాంగ్ నోట్‌బుక్‌లను అందజేయనున్నారు. జిల్లాకు మొత్తం 4,77,450 నోట్‌బుక్‌లు రావలసి ఉండగా 4,12,500 నోట్‌బుక్‌లు వచ్చి చేరాయి. మిగిలినవి నెలాఖరు వరకు రానున్నాయి. శనివారం వరకు జిల్లాలోని 12 మండలాల కేంద్రాలకు నోట్‌బుక్‌లను తరలించారు.



పాఠశాల ప్రారంభం రోజే అందిస్తాం

ఈ విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థుల చేతికి పుస్తకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పార్ట్-1 విభాగం కింద వచ్చే పుస్తకాలు 50 శాతం వరకు జిల్లా గోదాం వచ్చి చేరాయి. మిగిలిన 50 శాతం పుస్తకాలు ఈ నెలాఖరులోపు రానున్నాయి. జిల్లాలోని మండల కేంద్రాలకు పుస్తకాల పంపిణీ మొదలుపెట్టాం.

- రాంప్రసాద్, జిల్లా టెక్స్ట్ బుక్స్ మేనేజర్

అన్నదాత ఆగమాగం



చిన్నకోడూరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

- కొనుగోలు కేంద్రాల్లో నరకయాతన
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- టార్పాలిన్లు, గన్నీ బ్యాగుల కొరత.. తరుగు పేరిట కోత
- జిల్లాలో లక్ష్యం చేరని కొనుగోళ్లు
- రోజుల తరబడిగా రైతుల పడిగాపులు
- ధాన్యం పేరుకుపోవడంతో మొలకలవుతున్న వైనం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి,సిద్దిపేట, మే 18 : అకాల వర్షాలకు అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని నిబంధనలు, సమస్యల మూలంగా ధాన్యం అమ్మడానికి రోజుల తరబడి పడిగాపులు తప్పడం లేదు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా వర్షాల కారణంగా ధాన్యమంతా తడిసిముద్ద కావడంతో కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరణకు ససేమిరా అంటున్నారు. కొన్ని కేంద్రాల్లో రోజుల తరబడిగా ధాన్యం పేరుకుపోయిన క్రమంలో మొలకలుగా మారి కనిపిస్తోంది.

3.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

జిల్లావ్యాప్తంగా రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించడానికి 418 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేలా అంచనా వేశారు. గత ఏప్రిల్ మొదటివారంలోనే ఒక్కొక్కటిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తూ వచ్చారు. ప్రస్తుతం నెలన్నర కావొస్తున్నా కొనుగోలు లక్ష్యం మాత్రం నెరవేరలేదు. ఇప్పటికీ జిల్లాలో 1.98 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు.



గన్నీ సంచులు లేక కుకునూరుపల్లి మండలం లకుడారంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

వర్షాలు ఉల్టా..పల్టా

ఈసారి జిల్లాలో యాసంగి పంట సాగు చేసిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అవసరమైన సమయంలో కానరాని వర్షాలు ఇప్పుడు అతివృష్టిని సృష్టిస్తున్నాయి. పంట పొట్టదశ సమయంలో సాగునీటి కొరతతో సుమారు 50వేల ఎకరాలపైనే వరిసాగు ఎండిపోయింది. పశువుల మేతగా రైతులు వినియోగించిన పరిస్థితి దాపురించింది. బావులు, బోర్లు అడుగంటిపోయాయి. ఐదారేళ్లలో ఎన్నడూ లేని విధంగా భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. దీనికితోడు ఏప్రిల్ నెలాఖరులో వడగండ్లు బీభత్సాన్ని సృష్టించాయి. అన్ని ఇబ్బందులను అధిగమించి పంటను అమ్ముకునే సమయంలో మళ్లీ అకాల వర్షాలు దడపుట్టిస్తున్నాయి. మొత్తంగా కరువు, వడగండ్లు, అకాల వర్షాలు రైతుల వెంట పడ్డాయి. ఉల్టాపల్టాగా వర్షాలు కురుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టార్పాలిన్ల కొరతతో దుబ్బాక మండలం చేర్వాపూర్‌లో చీర పెల్కలే రక్షణ

అప్రమత్తం కావాల్సిందే

జిల్లా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే పలుమార్లు జిల్లా కలెక్టర్ మనుచౌదరి సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం కానరావడం లేదు. ఓ వైపు వర్షాకాలం సమీపిస్తుండగా.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం పేరుకుపోతున్నది. వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన నిర్వాహకులేమో వచ్చీరాని నిబంధనలు పెడుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అందుకే రోజుల తరబడి రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిస్తే తమకేం సంబంధమని రైతులు అంటున్నారు. వెంటనే కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెబుతున్నారు.

కనీస సౌకర్యాలు లేవు



రెక్కల కష్టం చేసి రేయింబవళ్లు కంటికిరెప్పలా కాపాడుకున్న ధాన్యాన్ని కేంద్రానికి తెస్తే ఫలితం దక్కడం లేదు. వేళకు తూకం పెట్టకపోవడంతో మొగులు దిక్కు చూస్తూ గడపాల్సి వస్తున్నది. దినం తప్పించి దినం వాన పడుతుంటే మా కష్టమంతా వరద పాలవుతుంది. టార్పాలిన్లు ఇవ్వకపోతే చీరసింపలే వేసి ధాన్యం ఆరబోస్తున్నం. మిగతా గింజలను కాపాడుకోడానికి కల్లాలు సక్కగ లేక 5 వేలు పెట్టి టార్పాలిన్ కవర్లు తెచ్చుకున్నం.

- గుమ్మడిదల నర్సయ్య, రైతు, చేర్వాపూర్

తడవడం.. ఆరబెట్టడం



వారం రోజుల కిందట ఎండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. అదే రోజు కొనుగోలు చేస్తే నాకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. రోజూ వర్షం పడుతుంటే ధాన్యమంతా తడుస్తున్నది. రోజంతా కష్టపడి ఆరబెట్టి కొనుగోలుకు సిద్ధం చేస్తే మళ్లీ వర్షానికి నానుతోంది. తడవడం, ఆరబెట్టడమే అవుతుంది. ఇప్పటికే దిగుబడి తగ్గి నష్టపోయాం. ఇప్పుడేమో కొనుగోలు చేయకుంటే అప్పులపాలవుతాం. ప్రభుత్వం స్పందించాలి.

- రెడ్డమైన భాస్కర్, రైతు, బొబ్బాయిపల్లి

16 రోజులుగా మార్కెట్‌లోనే..



మాది సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామం. 16 రోజుల కిందట 3 ట్రాక్టర్ల నిండా వడ్లను సిద్దిపేట మార్కెట్‌కు తెచ్చాను. తేమ శాతం తగ్గలేదని మూడు రోజులు, బర్దాను సంచులు లేక నాలుగు రోజులు, వర్షానికి పది రోజులుగా పడిగాపులు కాస్తున్నాను. ఇప్పుడు పడిన వర్షానికి మరో మూడు రోజులు తప్పేలా లేదు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదు.

- శ్రీను, రైతు, ఎన్సాన్‌పల్లి

కేంద్రాల్లో సమస్యల వెల్లువ

కొనుగోలు కేంద్రాల్లో అనేక సమస్యలు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి' పలు కథనాల ద్వారా జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చింది. కానీ చాలాచోట్లా ఈ సమస్యలు పరిష్కారం కాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన లేకనే ఈ పరిస్థితులు తలెత్తాయని విమర్శలున్నాయి. టార్పాలిన్లు సమకూర్చకపోవడంతో రైతులు సొంతంగా కవర్లు తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్లా చీరలనే టార్పాలిన్లుగా ఉపయోగిస్తూ తమ ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇక తరుగు పేరిట దోపిడీ కొనసాగుతూనే ఉంది. కాంటాలలో తేడాలు ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గన్నీ సంచుల కొరత వేధిస్తున్నది. జాప్యం చేస్తున్నారు. అందుకే ధర గిట్టుబాటు కాకున్నా చాలామంది దళారులకు, మిల్లర్లకు విక్రయిస్తున్నారు.

'డబుల్' తంటాలు

- ఓవైపు మల్లన్నసాగర్ భూనిర్వాసితుల తాత్కాలిక నివాసం
- మరోవైపు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలని అసలు లబ్ధిదారుల గగ్గోలు
- మాకు రావాల్సినవి చెల్లిస్తే మా దారిన మేం పోతామంటున్న నిర్వాసితులు

గజ్వేల్, మే 18: గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల అటు లబ్ధిదారులు ఇటు మల్లన్నసాగర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు మధ్య పేచీలను పెంచుతున్నాయి. ఇళ్ల కేటాయించిన లబ్ధిదారులు తాత్కాలికంగా నివాసం ఉంటున్న నిర్వాసితులను తమ ఇంటిని అప్పగించాలని ఒత్తిడి పెంచుతుండడంతో గొడవలు జరుగుతున్నాయి.

గతంలో ప్యాకేజీ, ప్లాట్లు, ఇళ్ల రాని మల్లన్నసాగర్ నిర్వాసితులకు గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్-ముట్రాజ్‌పల్లి గ్రామాల మధ్య నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో 2021లో ప్రభుత్వం తాత్కాలిక నివాసాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం 2023 మార్చిలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లోని అర్హులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అందజేసేందుకు లాటరీ ద్వారా 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అప్పటి నుంచి లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ఖాళీ చేయాలని భూనిర్వాసితులతో కటువుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల డబుల్ ఇళ్ల లబ్ధిదారులు కొందరు భూనిర్వాసితుల వద్దకు వెళ్లి ఇళ్లను అప్పగించకుంటే సామగ్రిని తీసి వేస్తామని గొడవ చేశారు. ఇళ్లను ఖాళీ చేస్తే తమకు అద్దె భారం తప్పుతుందని, సొంతింటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు అంటున్నారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఆవేదన అర్థం చేసుకున్న భూనిర్వాసితులు సైతం తమకు రావాల్సిన ప్లాట్లు, ప్యాకేజీ, నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తే ఇళ్లను ఖాళీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నారు. ఇద్దరి వాదన సరిగానే ఉన్న ప్రభుత్వం చొరవ చూపితేనే ఈ సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుంది. పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీ మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను ప్రస్తావించింది. ఈ క్రమంలో భూనిర్వాసితులు సైతం ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలి

- కలెక్టర్ మను చౌదరి



సిద్దిపేట అగ్రికల్చర్ మే 18: టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని కలెక్టర్ మనుచౌదరి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వివిధ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, ఏజెన్సీలు పేర్లలో టీఎస్ బదులుగా టీజీగా మార్చాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అనుమతులు రాగా, తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని వినియోగించేందుకు అనుమతి జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంస్థలు, పీఎస్‌యూలు, ఏజెన్సీల పేర్ల ముందు టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని ఆదేశించారు. జిల్లాలోని పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి గల సంస్థలు, ప్రభుత్వ సంస్థలన్నీ ఇకపై వాటి పేర్లను టీజీతో ప్రారంభమయ్యేలా మార్చుకోవాలని ఆయన సూచించారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వేదికలు, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని ఆయన ఆదేశించారు. శాఖల ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాలలో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని ఆయన సూచించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై ఈ నెల 25వ తేదీలోపు అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలని, ఆ నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షల నిర్వహణ

- సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట కలెక్టర్ల వెల్లడి

7లో

ఉద్యాన పంటలతో అధిక దిగుబడులు

- పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి

అతనో ఉన్నతాధికారి వద్ద గన్‌మన్..కానీ, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. లక్షల్లో అప్పులు చేశాడు. దీంతో కుటుంబంలో గొడవలు.. అప్పులు తీరే మార్గం కనిపించక ఉన్మాదిలా మారాడు. ఇద్దరు పిల్లలు.. భార్యను తన సర్వీస్ రివ్వాలర్‌తో కాల్చి చంపి.. తనూ ఆత్మహత్య చేసుకున్నాడు.

అతను రైల్వే ఉద్యోగి.. మంచి జీతం, అంతకంటే మంచి ఉద్యోగం. కానీ, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. రూ. 2 కోట్లకు పైగా బెట్టింగ్‌ల్లో పోగొట్టుకున్నాడు. తండ్రి ఎంత మందలించినా వినలేదు. అప్పటికే కొన్ని ఆస్తులు విక్రయించగా.. మరికొన్ని ఆస్తులు విక్రయించేందుకు సిద్ధపడగా.. విసిగిపోయిన తండ్రి ఆ తనయుడిని దారుణంగా కొట్టి చంపాడు.

ఓ యువకుడు చదువుకుంటున్నాడు. తల్లిదండ్రులు దాచుకున్న డబ్బులు ఆన్‌లైన్ గేమ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. వారు అడిగితే ఏం చెప్పాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నాడు.



జీవితాలతో ఆటలు..!

- అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్
- బానిసలుగా మారుతున్న యువత
- చివరకు ఆత్మహత్యల వైపు..
- పల్లెలకూ పాకిన విషపు క్రీడ
- కన్నపేగుపై ప్రేమతో ఆస్తులు అమ్ముతున్న తల్లిదండ్రులు

సండే స్పెషల్

దుబ్బాక, మే 18 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లు.. గేమ్స్ బారిన పడి యువత అప్పుల బాధతో జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటూ ఇటు తల్లిదండ్రులను, అటు కుటుంబాలకు తీరని మనోవ్యథను మిగులుస్తున్నారు. తెలంగాణలో సుమారు 22 శాతం మంది యువత ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలవుతున్నట్లు ఇటీవల జరిగిన ఓ సర్వేలో తేలింది. ఇప్పుడు ఈవిషపు క్రీడ పల్లెలకూ పాకింది. గ్రామాల్లోని యువత కూడా ఆన్‌లైన్ గేమ్స్.. బెట్టింగ్‌లు కాస్తూ అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. అలాగే, సిద్దిపేట జిల్లాలో నెలకు సుమారు 15 వరకు ఆత్మహత్యల కేసులు నమోదవుతున్నాయి. ఇందులో చాలా వరకు అప్పుల బాధతో అని పోలీసుల రికార్డులకు ఎక్కుతున్నా.. యువత ఆత్మహత్యల వెనుక ఆన్‌లైన్ అప్పులూ ఓ కారణంగా అనుమానిస్తున్నారు.

ఆశపెట్టి వలలోకి..

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లో బోనస్‌ల పేరిట.. వివిధ పథకాల పేరిట రూ.లక్షలు వస్తాయని ఆశపెట్టడంతో యువత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు ఆకర్షితులవుతున్నారు. మొదట తమ వద్ద ఉన్న డబ్బులు పెట్టి, ఆ తర్వాత తమ వాళ్ల, లేదా అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లలో పోగొట్టుకుంటున్నారు. ఎన్నిసార్లు ఆడిన డబ్బులు పోవడమే తప్ప.. రావడం లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చివరికి అవి తీరే మార్గం కనిపించక జీవితాలను అర్థంతరంగా ముగిస్తున్నారు.

గ్రామాల్లో పంచాయితీలు..

గ్రామాల్లో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా కూడా ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొదటి సారి ఆడినప్పుడు డబ్బులు రావడం.. వివిధ కారణాలతో యువత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు అలవాటు పడి ఎంత వడ్డీకి అయిన అప్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నిసార్లు 30 శాతం వడ్డీకి కూడా అప్పులు తీసుకుని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. అయితే, ఆ అప్పులు తీర్చలేక గ్రామ పెద్దల ఎదుట పంచాయతీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. విషయం తెలిసి తల్లిదండ్రులు లబోదిబోమంటు అప్పులు ఇచ్చిన వారిని పిలిచి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. కన్నపేగు మీద ప్రేమతో ఆస్తులు అమ్మి అప్పుల భారాన్ని మోస్తున్నారు.

నమోదు కాని కేసులు

అప్పుల బాధతో యువత ఆత్మహత్యలు.. ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతుండటంతో తల్లిదండ్రులు, వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాయి. చేతికి అందివచ్చిన బిడ్డ అప్పుల పాలై.. వాటిని తీర్చలేక ఇలాంటి దారుణానికి ఒడిగడుతుండటంతో కన్నపేగు మీద ప్రేమ, గ్రామాల్లో విషయం తెలిస్తే పరువు పోతుందనే భయంతో విషయాలను బయటకు చెప్పేందుకు వెనకాడుతున్నారు. దీంతో ఇలాంటి కొన్ని ఆత్మహత్యలు పోలీసు రికార్డులకు, కేసులు నమోదు నోచుకోవడం లేదు.





'దుబ్బుల' కళాకారులను సాంస్కృతిక శాఖలో చేర్చాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెల్లేల బాలక్రిష్ణ


పాపన్నపేట, మే 18: దుబ్బుల కొలుపు కళాకారులను తెలంగాణ సాంస్కృతిక శాఖలో చేర్చడంతోపాటు ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెల్లేల బాలక్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా ఏడుపాయలలో దుబ్బుల కొలుపు కళాకారులతో కలసి మహా కొలుపు కార్యక్రమంలో పాల్గొన్నారు. వందలాది కళాకారులు వాయిద్య పరికరాలైన, డప్పులు, కొమ్ములు చేతబూని దుర్గమ్మ, పోతరాజులు వేషధారణతో మహాకొలుపు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కొలుపు వృత్తి కళను తెలంగాణ సాంస్కృతిక శాఖలో భాగంగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షల ఉచిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కళాకారులందరికి నెలకు రూ.5 వేల పింఛను, సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. దేవాలయాల్లో గ్రామీణ కళాకారులకు గ్రామీణ పూజారులుగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుబ్బుల కొలుపు రాష్ట్ర యూనియన్ కోశాధికారి బోగిరి ఆనంద్, జనగారి లక్ష్మణ్, సంపత్, గిరుగుల సమ్మయ్య, రవీందర్, నామిని, రాజ్‌కుమార్, వాండేస్, జనగరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఏడుపాయల వన దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించిన మహా కొలుపులో తమ కళను ప్రదర్శిస్తున్న దుబ్బుల కళాకారులు















21న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

● క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే 18: సంగారెడ్డి జూబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎం.ఎస్. అకాడమీలో ఈ నెల 21న ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు మెదక్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో క్రీడాకారులు హాజరుకావాలని సూచించారు. ఎంపికల్లో పాల్గొనే వారు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న అండర్-25 టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రికెట్‌లో ఉన్నతంగా ఎదగాలనుకునే క్రీడాకారులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మెదక్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి సూచించారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



శంకర్ (ఫైల్)

శివ్వంపేట, మే 18: రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని బొజ్యాతండా పంచాయతీ పరిధిలోని హరిదాస్‌తండాకు చెందిన బానోత్ శంకర్(35), అదే తండాకు చెందిన మూడవత్ రాంచందర్ ఇద్దరు కలిసి గురువారం రాత్రి గంగాయిపల్లి ఊడుగుల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బానోత్ శంకర్ నీట మునిగాడు. గమనించిన రామచందర్ అక్కడి నుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం స్థానికులకు చెరువు దగ్గర శంకర్ దుస్తులు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించినా మృతదేహం లభించలేదు. శనివారం ఉదయం శంకర్ మృతదేహం చెరువులో తేలడంతో బయటకు తీశారు. మృతుడి భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

● బస్సు ఎక్కుతుండగా లాక్కెళ్లిన దుండగులు

జహీరాబాద్, మే 18: మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం మధ్యాహనం జరిగింది. జహీరాబాద్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం చీలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ గ్రామం నుంచి సంగారెడ్డికి వెళ్లేందుకు జహీరాబాద్ బస్టాండ్‌కు వెళ్లింది. సంగారెడ్డికి వెళ్లే బస్సులో ఎక్కుతున్న క్రమంలో రద్దీగా ఉండడంతో తోపులాట జరుగుతుండగా గుర్తు తెలియని వక్తులు అదును చూసి ఆమె మెడలో ఉన్న 8తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. గొలుసు విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని వారు తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జహీరాబాద్ పోలీసులు వివరించారు.

జీపీ కార్యదర్శిని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

వెల్దుర్తి, మే 18: విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శిని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవతగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా తోమెటి రాజేశం పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నాం సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఉన్న రాజేశం వద్దకు అదే గ్రామానికి చెందిన కావేటి శేఖర్ వెళ్లి.. తన స్థలంలో డ్రైనేజీ కట్టిస్తావా, నీ సంగతి చూస్తానంటూ పంచాయతీ కార్యదర్శి చొక్కాను పట్టుకుని దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా కార్యాలయ ఆవరణలో ఉన్న కర్రతో కొట్టేందుకు ప్రయత్నం చేశాడు. శేఖర్‌తో ప్రాణభయం ఉన్నదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజేశం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


● మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద



నర్సాపూర్ కోర్టు ఆవరణలో మొక్కను నాటుతున్న మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద, న్యాయవాదులు

నర్సాపూర్, మే 18: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే తమ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. శనివారం నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో స్థానిక న్యాయాధికారి కె.అనితతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. ప్రతి ఒక్కరు చెట్లను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. చెట్లతో పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన గాలి, ఫలాలు ఇచ్చి ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ఇష్టానుసారంగా చెట్లను నరకవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పీపీ రాఘవేందర్, ఏజీపీ సత్యనారాయణ, సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్, న్యాయవాది స్వరూపరాణి పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో ప్రజిన్‌కు 159వ ర్యాంకు



ఉప్పల ప్రజిన్

చేర్యాల, మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి చెందిన ఉప్పల ప్రజిన్ రాష్ట్ర స్థాయిలో 159వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీలో ఇంటర్ పూర్తిచేసిన ప్రజిన్ ఎప్‌సెట్ అర్హత పరీక్షలో 121.49మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ప్రజిన్ మెయిన్స్‌లో ఆలిండియా 709ర్యాంకు సాధించాడు. ప్రజిన్‌ను స్థానికులు అభినందించారు.

తండ్రి మరణంతో అనాథైన బాలుడు

● ఆర్థిక సాయం అందజేసిన గ్రామస్థులు

కుకునూరుపల్లి, మే 18: రాయవరం గ్రామానికి చెందిన రామిండ్ల స్వామి(16) తన ఐదవ ఏటనే అనారోగ్యంతో తల్లిని కోల్పోగా, గురువారం తండ్రి కూడా అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆ బాలుడు అనాథయ్యాడు. ప్రస్తుతం స్వామి ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో గ్రామ పంచాయతీ నిర్మించిన వాటర్ ప్లాంట్‌లో నివాసం ఉంటున్నారు. దీంతో గ్రామంలోని యువకులు చొరవ తీసుకొని గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించి శనివారం రూ.32వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షల నిర్వహణ

● సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం
● టీఎస్‌పీఎస్సీ చైర్మన్ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట కలెక్టర్ల వెల్లడి

సంగారెడ్డి రూరల్, మే 18: జూన్ 9న నిర్వహించే గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని రకాలుగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్ రాజ్, మను చౌదరి తెలిపారు. శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా కలెక్టరేట్‌ల నుంచి వేర్వేరుగా కలెక్టర్లు హాజరై, మాట్లాడారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలను పకడ్బందీగా సజావుగా నిర్వహించేందుకు అన్ని అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మేరకు ఫర్నిచర్, టాయిలెట్స్, తాగునీరు విద్యుత్ సరఫరా వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఒక రోజు ముందుగానే వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధ్రువీకరించుకోవాలని కలెక్టర్లు సూచించారు. బయోమెట్రిక్ హాజరు నమోదు నేపథ్యంలో 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతినిస్తారని, అభ్యర్థులు రెండు గంటల ముందు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. పది గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పరీక్షా నిర్వహణకు సంబంధించి ప్రశ్నాపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో నిర్వహిస్తామని కలెక్టర్లు తెలిపారు. ప్రతి అంశం సీసీ కెమెరాలు రికార్డు అయ్యేలా చూస్తామన్నారు. జిల్లా అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు పరీక్ష నిర్వహణకు అవసరమైన మేరకు సిబ్బందిని నియమించనున్నట్లు కలెక్టర్లు వివరించారు. అభ్యర్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడిసేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతామని చెప్పారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

సంగారెడ్డి జిల్లాలో 9,672 మంది అభ్యర్థులు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ... జిల్లాలో 9,672 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వారికోసం 37 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి బయోమెట్రిక్ యంత్రాలు ఒక రోజు ముందుగానే జిల్లాకు వస్తే వాటిని పరిశీలించి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ క్రాంతి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఏవో పరమేశం, పరీక్షల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 4వేల మంది అభ్యర్థులు

మెదక్ అర్బన్: గ్రూప్-1 పరీక్ష నిర్వహణ కోసం మెదక్ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 4 వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రతీ కేంద్రంలో ఇద్దరు ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో 8,239 మంది అభ్యర్థులు

సిద్దిపేట అగ్రికల్చర్: సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... జిల్లాలో 21 సెంటర్లలో 8,239 మంది అభ్యర్థులకు గ్రూప్-1 పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా పరీక్షలను నిర్వహిస్తామని కలెక్టర్ మనుచౌదరి వివరించారు. ఈ సమావేశంలో పోలీస్ నోడల్ అధికారి అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, ఇందూరు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తి

● సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, మే 18: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24నుంచి జూన్ 3వరకు పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఫస్టియర్‌లో 9,318 మంది, ఒకేషనల్ 599 మంది, సెకండియర్‌లో 4,646 మంది, ఒకేషనల్ 323 మంది, మొత్తం 14,886 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లు పొందాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

● ఎక్కువ కేసులను పరిష్కరించండి: న్యాయాధికారి భవానీచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, మే 18: జూన్ 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర కోరారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో బ్యాంకు, పోలీసు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ అధికారులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, మోటార్ వెహికిల్ నష్ట పరిహార కేసులు, బ్యాంకు కేసులు, రాజీ మార్గాన పరిష్కారానికి అనువైన కేసులన్నీ పరిష్కరించాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులు గుర్తించి తమ కేసులన్నీ పరిష్కరించుకోవాలని జి.భవానీచంద్ర కోరారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.జయంతి, రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి డా.పి.కృష్ణార్జున్, మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి జి.సునీతారవీంద్రారెడ్డి, నాల్గవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.లావణయ్య, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మణ్‌చారి, ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి పి.తేజశ్రీ, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో

జహీరాబాద్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బ్యాంకు అధికారులతో లోక్ అదాలత్‌పై సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.సూరిక్రిష్ణ సమావేశం నిర్వహించారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సౌజన్యంతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో జూన్ 8న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తామని చెప్పారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో న్యాయవాదులు సోమశేఖర్, జగన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి సూరిక్రిష్ణ

సిద్దిపేటలో


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి

సిద్దిపేట క్రైం: సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి మాట్లాడారు. జూన్ 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. అత్యధిక కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీ పడేందుకు కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేయాలన్నారు.

భూముల విలువ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళనకు సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపార సంఘం సభ్యులు

సిద్దిపేట టౌన్, మే 18: భూముల విలువను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపార సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజలింగం డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో రియల్ ఎస్టేట్ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే నత్తనడకలా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం భూముల విలువ పెంచడంతో పూర్తిగా డీలా పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ వాల్యూ ఉంటుందని, భూమి విలువ పెరగడం ద్వారా రిజిస్ట్రేషన్ వాల్యూ పెరుగుతుందన్నారు. దీని వల్ల భూముల అమ్మకాలు, కొనుగోలు పూర్తిగా నిలిచిపోయి తమ జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆలోచించి 7.5 శాతం ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలను మూడు శాతానికి తగ్గించి భూముల విలువలను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులమంతా కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రంగయ్య, కార్యదర్శి దరిపల్లి శ్రీనివాస్, చిన్నా, సభ్యులు నర్సింలు, బాలయ్య, ముగిలి శ్రీనివాస్, చింతల యాదగిరి, అడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక దిగుబడులు

● పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి


సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీలో బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి

ములుగు, మే 18: ఉద్యానవన పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు రావడమే కాకుండా అధిక ఆదాయం వస్తుందని రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీలో డాక్టర్ విసి.నీరజప్రభాకర్ అధ్యక్షతన విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం విశ్వవిద్యాలయం చేపట్టిన పరిశోధన విస్తరణ ఫలితాలను విశ్లేషించుకుంటూ ఉద్యాన అధికారులు, విస్తరణ అధికారులు, ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు రాబోయే సంవత్సరానికి చేపట్టవలసిన పరిశోధనను నిర్ణయిస్తారని, మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునే విత్తన రకాలు, వంగడాలు నాటాలని ఆయన సూచించారు. ఉద్యాన పంటలను సాగు చేయడం వలన రైతులకు సంప్రదాయ పంటల కంటే రెండు రెట్లు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ బి.నీరజప్రభాకర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న వివిధ పరిశోధనా స్థానాల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులకనుగుణంగా పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వివిధ పంటల్లో వచ్చే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను ఉద్యాన శాఖ, విస్తరణ విభాగం ద్వారా రైతులకు ఉద్యాన పంచాంగం, బ్రోచర్ పాంప్లెట్స్, రేడియో, టీవీ కార్యక్రమాల ద్వారా వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు అవగాహన కల్పించారు. కేవీకే వారు తయారుచేసిన కరివేపాకు పొడి, మునగాకు పొడి, గోరింటాకు పొడిలను ఉద్యాన కమిషనర్ పరిశీలించారు. ఇటువంటి ఉత్పత్తులను స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేసేందుకు వారికి శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలని కోరారు. రైతులు ఉద్యానశాఖ అధికారులను వివిధ పంటల సాగుపై అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. జనగామ నుంచి వచ్చిన రైతు వై.వెంకన్న మాట్లాడుతూ.. ఉద్యాన పంటలకు సబ్సిడీ మీద కూరగాయల విత్తనాలు, డ్రిప్ పరికరాలు, శాశ్వత పందిరి ఇచ్చి ఉద్యాన పంటల సాగును పెంచడానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

మారెపల్లి లక్ష్మీనారాయణుడి కల్యాణ మహోత్సవం


మారెపల్లిలో లక్ష్మీనారాయణస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, వేడుకకు హాజరైన భక్తులు

కొండాపూర్, మే 18: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారెపల్లి లక్ష్మీనారాయణ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వైకుంఠపురం ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, బాజాబజంత్రీలతో భక్తుల మధ్య కల్యాణం జరిపించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ యజ్ఞం, యాగాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు భరతనాట్య ప్రదర్శన చేశారు. కోలాటాలు, నృత్యాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు, భజన, సంకీర్తనలు వంటి కార్యక్రమాలతో ఆలయం సందడిగా మారింది. వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా వేణుగోపాలస్వామి తిరు కల్యాణం


దొంతిలో వేణుగోపాలస్వామి తిరు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

శివ్వంపేట: మండలంలోని దొంతి గ్రామంలో దేవాదాయ శాఖ పరిధిలోని ప్రఖ్యాతి గాంచిన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఏటా వైశాఖమాసంలో 11 రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, స్నేహలతరెడ్డి, సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి గోపాలకృష్ణశర్మ సమక్షంలో వేణుగోపాలస్వామి తిరు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి విగ్రహన్ని గ్రామంలోని వీధుల్లో ఊరేగించి, ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. 9మందికి గాయాలు


ఆరూర్ గ్రామం వద్ద బోల్తా పడిన బస్సు

సదాశివపేట, మే 18: ట్రావెల్ బస్సు బోల్తాపడి తొమ్మిది మంది గాయపడిన సంఘటన శనివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర ముఖతి(35) తన కుటుంబ సభ్యులు 10మందితో కలిసి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం, తిరుపతి దేవస్థానాలను దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11గంటల సమయంలో సదాశివపేట మండలం ఆరూర్ గ్రామం వద్ద డ్రైవర్ అజాగ్రత్తతో జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహేంద్ర ముఖతి భార్య ప్రేరణ(27), కూతురు సురవిక, బంధువులు నరేష్, మరో ఐదుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడిన కారు

● ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి స్వల్ప గాయాలు

కుకునూరుపల్లి, మే 18: మూలమలుపు వద్ద డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కారు బోల్తాపడిన సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. సంగారెడ్డికి చెందిన ఓ కుటుంబ సభ్యులు సిద్దిపేట నుంచి సంగారెడ్డికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారు ముందు భాగంలో కూర్చున్న నౌసిన్ తలకు, ఛాతిలో బలమైన గాయాలవ్వడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కారులో ఉన్న మన్సూర్ కుడి చేయి విరగగా, మసూద్‌అలీకి స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఉన్న మూడు సంవత్సరాల పాపకి ఎలాంటి గాయాలు కాకపోవడం విశేషం. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


నౌసిన్‌కి ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

కూరగాయల వ్యాపారుల ఆందోళన


రామాయంపేటలో ధర్నా చేస్తున్న కూరగాయల వ్యాపారులు

రామాయంపేట, మే 18: వసతులతో కూడిన మార్కెట్‌ను నిర్మించాలంటూ రామాయంపేటలో కూరగాయల వ్యాపారులు శనివారం ధర్నాకు దిగారు. అమ్మకాలు ఆపేసి ఆందోళన బాట పట్టారు. తాము మున్సిపల్ వారికి నిత్యం తైబజార్ కడుతున్నా తమ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇక్కడ రైతు బజార్ నిర్మించినా ఎలాంటి వసతులు కల్పించక అమ్మకాలు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొన్నాళ్లుగా సీఎస్ఐ చర్చి ఆవరణలో తాత్కాలికంగా కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఇక్కడి నుంచి దుకాణాలు ఎత్తివేయాలని చర్చి నిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● నాగపురిలో ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణాశిబిరం
● ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు
● నిత్యం 50మంది హాజరు

చేర్యాల, మే 18: వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందింపజేయడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కల్పించే దిశగా సిద్దిపేట జిల్లా యువజన క్రీడలశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌లో ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 24నుంచి ఈ నెల 8వరకు ఉచిత రెసిడెన్షియల్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విద్యార్థులు ఆకర్షితులవడంతో శిక్షణను కొనసాగిస్తున్నారు. ఈ నెల 31వరకు సాధారణ శిబిరం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడంతో గ్రామానికి చెందిన విద్యార్థులతో పాటు సమీప గ్రామాల విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. చేర్యాల పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ పీఈటీ రఫత్ ఉమర్, నాగపురి జడ్పీఎస్ఎస్ పీఈటీ జి.విశాల నిత్యం ఉదయం వేళల్లో 50మంది విద్యార్థులకు హ్యాండ్‌బాల్ క్రీడాశిక్షణనిస్తూ మెళకువలు నేర్పిస్తున్నారు.



హ్యాండ్‌బాల్ ఉచిత శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులు

మెళకువలు నేర్చుకున్నాను : బాలు, నాగపురి



నేను నాగపురి జడ్పీఎస్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాను. హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో నాకు ఆసక్తి కలిగి, మెళకువలు నేర్చుకున్నాను. వేసవి సెలవులను వృథా చేయలేదన్న సంతృప్తి ఉంది.

జాతీయస్థాయికి ఎంపికవుతాను: జ్యోత్స్న, నాగపురి



హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో నాకూ ప్రేరణ కలిగించింది. పీఈటీలు సూచించిన మెళకువలను పాటించాను. మరింత ప్రావీణ్యం పొంది జాతీయస్థాయికి ఎంపికవుతానన్న నమ్మకం కలిగింది.

మానసికోల్లాసానికి దోహదం : పీఈటీ జి.విశాల



గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు, యువతలో మానసికోల్లాసం కలిగించడంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందించేందుకు శిక్షణా శిబిరాలు దోహదం చేస్తాయి. శిక్షణా శిబిరానికి 50మంది విద్యార్థులు హాజరవుతున్నారు. మెళకువలు నేర్పుతూ తీర్చిదిద్దుతున్నాం.


హ్యాండ్‌బాల్ సర్వీసింగ్‌పై శిక్షణ ఇస్తున్న పీఈటీ రఫత్


హ్యాండ్‌బాల్‌తో సర్వీసింగ్ చేస్తున్న విద్యార్థిని



రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి కల్లాలను ఏర్పాటు చేసింది. కానీ రైతులు అక్కడ ధాన్యాన్ని ఆరబెట్టుకోకుండా రోడ్లపై ధాన్యం కుప్పలు పోయడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని అల్వాల్, భూంపల్లి, బేగంపేట, ఖాజీపూర్ గ్రామాలతోపాటు వివిధ గ్రామాల్లో రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు.

- మిరుదొడ్డి

ఇంటర్‌లో దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్ టౌన్, మే 18: హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డీఎస్ వెంకన్న తెలిపారు. ప్రవేశం పొందేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీలు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, మే 18: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన బీజేపీ శ్రేణులతో కలిసి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి పోయిందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, చిట్టి గోపాల్‌రెడ్డి, రాయికుంట చందు, విద్యాసాగర్‌రెడ్డి, సంతోష్, రాంప్రసాద్, మహేష్కర్ ఉన్నారు.

- గజ్వేల్: తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డీబీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జాలిగామ, బయ్యారం, ముట్రాజ్‌పల్లి గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందట తడిసి ముద్దవుతుంటే రైతులు ఆగమవుతున్నారన్నారు.



హుస్నాబాద్: మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



కోహెడ: మండలంలోని వరుకోలులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

- కోహెడ: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పార్టీ శ్రేణులతో కలిసి శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలతో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయనవెంట మండల ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్య, బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రామంచ రాంచంద్రరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కక్కర్ల దామోదర్‌గౌడ్, బత్తిని రమేష్, కిష్టారెడ్డి, సంతోష్, అరవింద్, బోయిని అజయ్, పరుశురాములు, బత్తిని శ్రీనివాస్, పవన్ కల్యాణ్, చల్లురు మురళి, కొమిరె రామస్వామి ఉన్నారు.

- చేర్యాల: చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, ఆకునూరు, పోతిరెడ్డిపల్లి తదితర గ్రామాలలో కాంటా పెట్టినబస్తాలు తడిసిపోయాయి.

- ములుగు: కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో నాగిరెడ్డిపల్లి, తునికిబొల్లారం, క్షీరాసాగర్, కొక్కొండలో ధాన్యాన్ని రోడ్లపైన ఆరబోశారు. వడగండ్ల వానకు ధాన్యం తడిసి ముద్దయింది.

హైనా దాడి..

మద్దూరు, మే 18: మండలంలోని వంగపల్లిలో మేకల మందపై హైనా దాడి చేసిన ఘటనలో 5 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతు కెంగర్ల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధి లోని తన వ్యవసాయ భూమి వద్ద ఏర్పాటు చేసుకున్న దొడ్డిలో ఉన్న మేకలపై శుక్రవారం రాత్రి హైనా దాడి చేయడంతో ఐదు మేక పిల్లలు మృత్యువాత పడ్డాయని తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

సిద్దిపేట రూరల్, మే 18: నేడు సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాలలోని మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7:30 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. నారాణయరావుపేట, లక్ష్మీదేవిపల్లి, చింతమడక సబ్ స్టేషన్‌ల పరిధిలో 33కేవీ విద్యుత్ లైన్ కింద చెట్ల కొమ్మల నరికివేత , చిన్న చిన్న మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ నిలిపివేత ఉంటుందని తెలిపారు.

శివాజీ విగ్రహావిష్కరణ

బెజ్జంకి, మే 18: మండలంలోని గూడెం గ్రామంలో శనివారం ఆరె క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆ సంఘం సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం అన్న వితరణ చేశారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్, మే 18: ఈ నెల 23వ తేదీ నుంచి జరిగే హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర పోస్టర్‌ను శనివారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు పున్న సమ్మయ్య, పచ్చిమట్ల స్వప్న, జగదీశ్వర్, లక్ష్మయ్య, నమిలికొండ రాజయ్య, పూదరి చంద్రమౌళి, గడిపె వీరయ్య, తాటికొండ పరమేశ్వర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కొండపాక, మే 18: మండలంలోని వెలికట్టకు చెందిన యాదగిరి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు పురుషోత్తమును ఎమ్మెల్సీ యాదవరెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మోదీకి కానుకగా ఇస్తున్నాం

- బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



రఘునందన్‌రావుతో గజ్వేల్ నియోజకవర్గంలోని మండలాలు, పట్టణాల బీజేపీ అధ్యక్షులు

గజ్వేల్, మే 18: మెదక్ పార్లమెంట్ సీటును మోదీకి కానుకగా ఇస్తున్నామని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు మన్నె శ్రీనివాస్, దాసరి అయిలయ్య, సాయిరెడ్డి రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, బీజేవైఎం జిల్లా నాయకులు మఠం మహిపాల్ యాదవ్‌లు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో ఓటింగ్ సరళిపై ఆయన చర్చించి, బీజేపీ 400 సీట్లలో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్



వృథాగా పోతున్న నీరు

చేర్యాల, మే 18: చేర్యాల పట్టణంలోని పెట్రోల్‌పంప్ వీధికి వెళ్లే మార్గంలోని మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతున్నది. రోజులతరబడిగా నీరంతా వృథాగా ప్రవహిస్తుండటంతో పాటు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మిషన్ భగీరథ సిబ్బంది, మునిసిపల్ అధికారులకు విషయం తెలిపినా మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి



గజ్వేల్: వాసవీకన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడి

గజ్వేల్/చేర్యాల, మే 18: వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవాలను గజ్వేల్ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ, ఉమామహేశ్వర ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. వారితో కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, ఉప్పల మెట్టయ్య, నాయకులు సిద్ది భిక్షపతి, అత్తెల్లి లక్ష్మయ్య, నంగునూరి సత్యనారాయణ, ఓంకార్, గంగిశెట్టి వెంకటేశం, జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా తదితరులున్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతిని శనివారం చేర్యాల పట్టణంలోని వైశ్యాభవన్‌లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో నెలకొల్పి వీధుల గుండా భజనలు చేసుకుంటూ, వైశ్యభవన్ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం వేదపండితులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా, రాష్ట్ర, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముత్యాల తలంబ్రాల పంపిణీ

జగదేవ్‌పూర్, మే 18: జగదేవ్‌పూర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో శ్రీరామకోటి భక్త సమాజ సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో శనివారం భక్తులకు భద్రాచల ముత్యాల తలంబ్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచల సీతారాముల కల్యాణానికి జగదేవ్‌పూర్ గ్రామంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 150కిలోల గోటి తలంబ్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో చిగుళ్లపల్లి వెంకటేశం, చంద్రశేఖర్, కుకుటం కొండలు, మరిపడిగె వెంకటేశం, పెద్ది శంకర్, మరిపడిగె రామకృష్ణ, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు

- ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్



క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న రైతులు

మద్దూరు, మే 18: ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్ సూచించారు. మండలంలోని రేబర్తి గ్రామ రైతు నలింగారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో, ఆర్టికల్చర్ అధికారి క్యాతం మమత అధ్యక్షతన ఉమ్మడి మద్దూరు దూళిమిట్ట మండలాల్లోని ఆయిల్ పామ్ రైతులకు వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. వేసవిలో రైతులు తప్పనిసరిగా చెత్తాచెదారాన్ని మొక్కలకు దూరంగా కాల్చడం ద్వారా డ్రిప్‌తో పాటు మొక్కలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. వేసవిలో మొక్కలకు సమపాళ్లల్లో నీటిని అందించాలని సూచించారు. ముఖ్యంగా ఎలుకల నుంచి పంటల్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. అంతరపంటలను మొక్కలకు దూరంగా వేసుకోవాలని సూచించారు. 2023-24లో 34 మంది రైతులు 121 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎకరాకు 3 టన్నులపైనే దిగుబడి వస్తుందన్నారు. ప్రతి మండలానికి కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ఆయిల్‌ఫామ్ గెలలు సేకరించి ఫ్యాక్టరీకి తరలిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు కల్పన, అఖిల్, రాధిక, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అసిస్టెంట్ రాకేష్, ప్లాంటేషన్ మేనేజర్ విజయ్, పంచాయతీ సెక్రటరీ మాదవ్‌జాదవ్‌తో పాటు ఆయిల్‌పామ్ సాగు రైతులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



కొండపాక: ఎరువుల అమ్మకాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

చేర్యాల/కొండపాక, మే 18: భూసారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట ఎరువు, జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొమురవెల్లి వ్యవసాయాధికారి నరేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీని శనివారం ఆయన ప్రారంభించారు. రైతులకు 60శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, ఒక ఎకరాకు 12కిలోల విత్తనాలు సరిపోతాయని ఆయన తెలిపారు. పచ్చి రొట్టె ఎరువులు సబ్సిడీపై సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారి ప్రియదర్శిని తెలిపారు. మండలంలోని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ఆగ్రోస్ దుకాణంలో శనివారం రైతులకు సబ్సిడీపై ఎరువులను అందజేశారు.

దోస్త్ ద్వారా కళాశాలలో ప్రవేశాలు

హుస్నాబాద్ టౌన్, మే 18: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు దోస్త్ ద్వారా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో అనేక సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని పేర్కొన్నారు. కళాశాలలో చేరిన వారికి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 29 లోపు రూ. 200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వర్షానికి కూలిపోయిన ఇల్లు

- నిరాశ్రయులైన వృద్ధులు



వర్షానికి కూలిన ఇల్లు

కుకునూరుపల్లి, మే 18: శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని రాయవరానికి చెందిన గుమ్మల ఐలయ్య గౌరమ్మల పెంకుటిల్లు కూలిపోయింది. రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పెంకుటిల్లు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వర్షానికి ఇల్లు కూలిపోవడంతో వృద్ధులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం

ములుగు, మే 18: మండలంలోని కొట్టాలలో నిర్వహించే మల్లన్న జాతరకు రావాలని శనివారం గ్రామ మాజీ సర్పంచ్ మల్లేష్‌యాదవ్ మాజీ సీఎం కేసీఆర్‌కు ఫాంహౌజ్‌లో ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 20న మల్లన్న జాతర ఉంటుందని, తప్పకుండా గ్రామానికి వచ్చి ఆలయాన్ని దర్శించుకోవాలని కోరారు. ఆయన వెంట ఉమ్మడి మెదక్ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డితో పాటు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

- ఏఐఐటీఏ రాష్ట్ర అధ్యక్షుడు యాఖినోద్దీన్



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలు

సిద్దిపేట టౌన్, మే18: విద్యార్థుల జీవితంలో పదోతరగతి, ఇంటర్మీడియేట్ ఎంతో కీలకమని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం వరిస్తుందని ఉపాధ్యాయుల ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ (ఏఐఐటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు యాఖినోద్దీన్ విద్యార్థులకు సూచించారు. శనివారం సిద్దిపేట పట్టణంలో ఏఐఐటీఏ సంస్థ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదోతరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముస్లిం మైనారిటీ విద్యార్థులను ఘనంగా సన్మానించి, ప్రశంస పత్రాలతో పాటు నగదు రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఇబ్రహీం, జుబేర్, ఏఐఐటీఏ సంస్థ మీడియా కోఆర్డినేటర్ నసీరుద్దీన్, అబ్దుల్ ఖుద్దుస్, కమాల్ తదితరులు పాల్గొన్నారు.

24న విత్తన మేళా

సిద్దిపేట రూరల్,మే 18: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలలో ఈ నెల 24న విత్తన మేళా నిర్వహిస్తున్నదని ప్రధాన శాస్త్రవేత్త ఎస్. శ్రీదేవి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తన మేళాలో వరి పంట దొడ్డు రకాలైన జేజీఎల్-24423(జగిత్యాల వరి-1),కెఎన్ఎం-118జ(కునారం సన్నాలు),సన్నరకాలైన ఎఎన్ఎం-1638(కునారం వరి-2), డబ్ల్యుజీఎల్-44(సిద్ధి),డబ్ల్యుజీఎల్-962(వరంగల్ వరి-2) ఫౌండేషన్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా కందిలో డబ్ల్యుఆర్‌జీఈ-97(వరంగల్-1) ఫౌండేషన్ విత్తనాలు అందుబాలో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సుచించారు. కార్యక్రమంలో భాగంగా రైతులు- శాస్త్రవేత్తల చర్చాగోష్టి నిర్వహిస్తామని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- నెల రోజులుగా మార్కెట్లోనే పడిగాపులు
- పట్టించుకోని అధికారులు

నారాయణరావుపేట, మే 18: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అరిగోసపడుతున్నారు. యాసంగిలో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు మండలంలో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల జాప్యం కావడం రైతులకు శాపంగా మారింది. ఒక్కో రైతు ధాన్యాన్ని మార్కెట్లోకి తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్లో పెరుకుపోయిన ధాన్యం కుప్పలు

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో మార్కెట్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలన్నర అవుతున్నా ధాన్యం కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో ఇప్పటికే రెండు, మూడు సార్లు అకాల వర్షాలు కురవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండటంతో కొంతమంది రైతులు పక్క గ్రామాల్లోని పీఏసీఎస్ లేదా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్నారు.

ఈ విషయంపై ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం విజయ నిర్మలను వివరణ కోరగా.. కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సమయంలో కొంత ఆలస్యం జరిగిందని, ఇప్పుడు అలాంటి సమస్య రాకుండా చూస్తున్నామన్నారు. గన్నీ బ్యాగులు, లారీలు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం సేకరణను వేగవంతం చేస్తున్నామని, వారం రోజుల్లో ధాన్యాన్ని పూర్తి స్థాయిలో సేకరిస్తామని ఆమె తెలిపారు.



వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రాశుల మీద టార్పలిన్ కవర్లు కప్పిన దృశ్యం

నెల రోజులుగా పడిగాపులు



ధాన్యం మార్కెట్‌కు తెచ్చి నెల రోజులు అయింది. వర్షానికి తడుస్తుండడంతో ఎండబెట్టి, కుప్ప చేసి ధాన్యం దగ్గర పడిగాపులు కాస్తున్నాం. ధాన్యం కాంటా కావడానికి ఇంకా ఎన్ని రోజులైతదో తెలుస్తలేదు. మా రైతుల బాధలు ఎవరూ పట్టించుకుంటలేరు.

- తాడేం రాములు, రైతు, నారాయణరావుపేట

వెంటనే కొనుగోలు చేయాలి



ఎక్కడి వడ్లు అక్కడనే ఉన్నాయ్. రైతుల గోస పట్టించుకున్నోల్లే లేరు. పది రోజులు అయితే రోహిణి కార్తీ సాగువాటు చేసి విత్తనాలు వేసుకునుడే అయితది. వడ్లు మాత్రం కోనుగోలు చేసుడు జాప్యం చేస్తుర్రూ. అధికారులు, నాయకులు రైతుల గోస పట్టించుకోవాలి.

- నల్ల రాములు, రైతు, నారాయణరావుపేట

కాలువలను శుభ్రం చేయించిన అధికారులు



ములుగు: చిన్న తిమ్మాయపల్లిలో మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ములుగు/దౌల్తాబాద్, మే 18: ములుగు మండలం చిన్నతిమ్మాయపల్లి లోని వైన్స్ సమీపంలో రోడ్డు పక్కన మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నట్లు శనివారం ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి మురుగు కాలువను శుభ్రం చేయించారు. అక్కడ కాలువ నిర్మాణం లేకపోవడంతో నీరు నిలిచిందని, కాలువ నిర్మాణం కోసం పైఅధికారులకు ప్రతిపాదన పంపించి నిర్మాణం కోసం కృషి చేస్తామని తెలిపారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త, మురుగు వాసన తట్టుకోలేక విద్యార్థులు ముక్కు మూసుకుని వెళ్లేవారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత పంచాయతీ అధికారి సతీష్ స్పందించారు. శనివారం కళాశాలకు వెళ్లే దారితో చెత్త కుప్పను, కులువలో మురుగును పారిశుధ్య కార్మికులతో తొలగించారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్



ఎస్ఈ మోహన్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సిద్దిపేట టౌన్, మే 18: ప్రజలకు నిత్య అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ, పని ఒత్తిడిలో ఉండే విద్యుత్ ఉద్యోగుల కోసం హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ మోహన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట పట్టణంలో ఎస్ఈ కార్యాలయంలో శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు, సిబ్బందికి కార్డియాలజీ, ఆర్థోపెడిక్, పల్మోనోలజీ స్క్రీనింగ్‌తో పాటు, బీపీ చెకప్, బ్లడ్, షుగర్, ఈసీజీ, టుడిఇకో, బోనే మినరల్ డెన్సిటీ, పీఎఫ్‌టీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దాదాపు 200 మందికి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్య సుదీష్, డాక్టర్ సోమేశ్ మంజునాథ్, డాక్టర్ అమర్, వినయ్ కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాధిక, డీఈలు శ్రీనాథ్, మహేష్, ఏడీఈలు గంగాధర్, సంతోష్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించాలి'



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

జగదేవ్‌పూర్, మే 18: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలుంటే పోటీ చేయకూడదు అనే జీవోను వెంటనే రద్దుచేయాలని ఇటిక్యాల దళిత సంఘం నేతలు దాస్, సుధాకర్, కుమార్, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1995లో తీసుకువచ్చిన ఈ జీవోను, నిబంధనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మున్సిపల్ ఎన్నికల్లో ఎంతమంది పిల్లలు ఉన్నా పోటీ చేసే అర్హత ఉన్నప్పుడు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముగ్గురు పిల్లలు ఉండోదన్న నిబంధన ఎందుకని వారు ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతో ఎంతో మంది ఉన్నారని, వారికి అవకాశం కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా వినతి పత్రం పంపిస్తామని పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ

గజ్వేల్, మే 18: గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజు కులస్థులు వారిక ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న వితరణలో వారు హాజరయ్యారు. వారితో జడ్పీటీసీ పంగ మల్లేశం, నాచారం మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, ఫాక్స్ డైరెక్టర్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందం, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, అహ్మద్, ఆగయ్య, ముత్యంరెడ్డి, బుచ్చిరెడ్డి, కొండల్‌రెడ్డి, రమేశ్, నరేశ్, కనకయ్య తదితరులున్నారు.

'సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారు'

గజ్వేల్, మే 18: ప్రజలకు సేవ చేయడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో వాసవీ యూత్ క్లబ్, వాసవీ వనీత క్లబ్ ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. వారివెంట గజ్వేల్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సిద్ది నవీన్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు నంగునూరి సత్యనారాయణ, అత్తెల్లి లక్ష్మయ్య, వాసవీ యూత్ క్లబ్, వాసవీ వనితా క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆకునూరులో తాగునీటి సమస్య

- వాగుబోరు పాడైపోవడంతో నిలిచిన సరఫరా



ట్యాంకర్ దగ్గర నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం

చేర్యాల, మే 18: చేర్యాల మండలంలోని ఏకైక మేజర్ గ్రామపంచాయతీ ఆకునూరులో తాగునీటి సమస్య నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాహార్తి తీర్చుకోలేక తల్లడిల్లుతుంటే పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రామశివారులోని వాగుబోరు నీటినే ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు తాగడానికి వినియోగిస్తున్నారు. వేసవి తీవ్రతనో, విద్యుత్ సరఫరాలో అంతరాయం తెలియదు గానీ కొద్దిరోజులుగా బోరు పనిచేయడం లేదు. దీంతో దాహార్తి తీర్చుకోవడానికి తంటాలుపడుతున్నామని, బోరుమోటారుకు మరమ్మతులు చేపట్టి నీటిసమస్య తీర్చాలని పంచాయతీ అధికారులను విన్నవించుకున్నా పట్టించుకోకడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులను నిలదీస్తే కంటితుడుపుగా ఒకటిరెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని వాపోతున్నారు.

ఎప్‌సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్, మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో హుస్నాబాద్ గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంపీసీ నుంచి 24 మంది, బైపీసీ నుంచి 15 మంది అర్హత సాధించారని ప్రిన్సిపాల్ విజయరాంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మధులు తెలిపారు. ఇందులో బైపీసీ అగ్రికల్చర్‌లో ఎ. మోహన్ (1670), ఎస్ రాహుల్ (12,496), పి. ధర్మ (12,756), ఎంపీసీ ఇంజనీరింగ్‌లో జే వీరన్న (25996) సీహెచ్. చందు (38764), జే. గణేశ్ (42900) ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చిన్నకోడూరు, మే 18: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దకోడూరులో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన చిట్టి శ్రీనివాస్‌రెడ్డి ఉదయం తన పాడి గేదెను మేత కోసం పొలం వద్ద తీసుకెళ్లి చెట్టుకు కట్టేసి ఇంటికి వెళ్లాడు. మేత మేసుకుంటూ గేదె తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. సుమారు వారం రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు విద్యుత్ తీగ తెగి పడిందని, సమీప రైతులందరూ కలిసి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించినా పట్టించుకోలేదని రైతు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించాడు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ రమేష్‌ను సంప్రదించగా వారం రోజుల కింద తెగిపడిన విద్యుత్ తీగను రైతులు చెప్పిన వెంటనే సరి చేశామని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ఈదురు గాలులకు విద్యుత్ తీగ మళ్లీ తెగి పడి ఉండొచ్చని, ఆ విషయం తనకు గాని తమ సిబ్బంది దృష్టికి రాలేదన్నారు.